క్లుప్తంగా

రుద్రాభిషేకం



స్వామివారి విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం ఉమాకామామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రతిఏటా ఉగాది పర్వదినం అనంతరం వచ్చే రోజున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకంగా నిర్వహించడం ఈ ప్రాంత ప్రజల ఆనవాయితీ. పాలవలస, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పౌరసరఫరాల గొడౌన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు: మండల కేంద్రంలోని పౌర సరఫరాల గొడౌన్‌ను తహసీల్దార్ జెన్ని రామారావు సోమవారం తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం గొడౌన్‌లో ఉన్న నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్ఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒంగోలులోని సోమవరప్పాడు వెళ్లి సుబ్బారెడ్డిని పరామర్శించారు. పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ యువ నాయకుడు రెడ్డి శ్రావణ్, తదితరులు ఉన్నారు.


సప్తాహం..



భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృందం సభ్యులు

జలుమూరు: శ్రీరామ నవమి పురస్కరించుకొని వెలుసోద గ్రామంలో సప్తాహం (భజన) కార్యక్రమం సోమవారం (రెండో రోజు) కొనసాగింది. మరో ఆరు రోజులపాటు నిరంతరాయంగా 70 భజన బృందాలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని రామాలయ ధర్మకర్త, నిర్వాహకుడు టి.జగన్నాథరావు తెలిపారు. వెలుసోదకు చెందిన రామలింగేశ్వర భజన మండలి, రామయ్యవలస, కరవంజ, గొళియాపుట్టి, యలమంచిలి, గొటివాడ, బసివాడ, పాగోడు తదితర గ్రామాల భజన బృందాల సభ్యులు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు.

విద్యార్థులకు నీతికథలపై పోటీలు



నీతికథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని కొండపై ఉన్న షిర్డీ సాయి బాబా మందిరంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం నీతికథలపై పోటీలు నిర్వహించారు. పాతపట్నం నగరంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ కార్యక్రమంలో మందిరం నిర్వాహకుడు తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లచ్చమ్మ పేరంటాల సంబరాలు

బూర్జ: మండల కేంద్రంలో సాకలి లచ్చమ్మ పేరంటాల 7వ వార్షికోత్సవాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన సంబరాలు మంగళవారం వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. రజక సంఘ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు..



నదిలోనే విడిచిపెట్టిన ఇంజిన్



ఎండిపోయిన మహేంద్రతనయ నది

- మహేంద్రతనయ నీటిని అడ్డుకుంటున్న ఒడిశా ప్రాంత రైతులు
- చుక్క నీరులేక వేసవి పంటలకు ఇబ్బందులు
- సుమారు 200 ఎకరాల్లో పలు రకాల పంటలు

ఆయకట్టు:	200 ఎకరాలు
రైతులు:	145 మంది
వేసవి పంటలు పండిస్తున్న రైతులు:	130 మంది
మహేంద్రతనయ నది నీటిపై ఆధారపడిన గ్రామాలు:	6

మెళియాపుట్టి: రైతుకు ఖరీఫ్ కలిసిరాలేదు. గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు వరి పంట కొంతమేర పాడైంది. వరి ధాన్యానికి కూడా మద్దతు ధర లభించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు కావస్తున్నా.. ఇంతవరకు రైతుకు ఎటువంటి సాయమూ (అన్నదాత సుఖీభవ) అందలేదు. దీంతో రబీ పంటలపైనే ఆశలు పెట్టుకున్నారు. మెళియాపుట్టి మండలంలోని కొసమాల, రట్టిణి, వసుంధర, మెళియాపుట్టి గ్రామాల రైతులు మహేంద్రతనయ నది నీటి ద్వారా వేసవి పంటలు పండిస్తున్నారు. నది ఎగువ ప్రాంతంలో ఉన్న ఒడిశా వాసులు దిగువ ప్రాంతానికి నీరు రాకుండా అడ్డుకట్టలు వేస్తూ.. అక్కడి పంటలకు నీటిని వినియోగించుకుంటున్నారు. దీంతో మెళియాపుట్టి పరిసరాల్లో మహేంద్రతనయ ప్రస్తుతం ఎడారిని తలపిస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకాన్ని (లిఫ్) మంజూరు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. అరకొరగా ఉన్న నీటిని కొద్దిరోజులు ఇంజిన్ల ద్వారా మళ్లించారు. ప్రస్తుతం నీటి సదుపాయం లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పండిస్తున్న పంటలకు సాగునీరు లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహేంద్రతనయ నదీ పరివాహక ప్రాంతంలో 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతీ ఏడాది మూడు పంటలు పండించి రైతులు ఆదాయం పొందేవారు. లిఫ్ట్ మంజూరు చేస్తే సంవత్సరానికి మూడు నుంచి నాలుగు పంటలు పండించుకుంటామని రైతులు అంటున్నారు.



నదీ పరివాహక ప్రాంతంలో వరి పంట

లిఫ్ట్ మంజూరు చేయాలి



మా గ్రామాలకు సాగునీటి సదుపాయం లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి లిఫ్ట్ మంజూరు చేయాలి. అలాచేస్తే తమ కష్టాలు తీరుతాయి. ప్రస్తుతం నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. మహేంద్రతనయ ఎండిపోవడంతో బోర్ల నుంచి కూడా నీరు రావడం లేదు.

– గొట్టిపల్లి కరెన్న, రైతు, కొసమాల గ్రామం, మెళియాపుట్టి మండలం

ఇదివరకెప్పుడూ ఇలా జరగలేదు



నేను గత 28 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. మహేంద్రతనయ నది నీటితోనే మిరప, క్యాబేజీ, జొన్న, తదితర కూరగాయల పంటలు పండిస్తున్నాను. ఎంత వేసవైనా మహేంద్రతనయ నది పూర్తిగా ఎండిపోవడం చూడలేదు. ప్రస్తుతం నదిలో చుక్కనీరు లేదు. పైన ఉన్న ఒడిశా గ్రామాలకు చెందిన రైతులు ఇసుక బస్తాలతో నదిలో అడ్డుకట్టలు వేసి నీరు దిగువకు రాకుండా చేస్తున్నారు. అందువలనే నదిలో పూర్తిగా నీరు లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించి అడ్డుపెట్టిన ఇసుక బస్తాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– కాళ్ల కాంతారావు, రైతు, మెళియాపుట్టి గ్రామం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



పార్టీ మండల అధ్యక్షులతో చింతాడ రవికుమార్, నాయకులు

- ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్
- పార్టీ మండల అధ్యక్షులకు సన్మానం

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమదాలవలస మండలం, పట్టణం, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాలకు ఇటీవల పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారిని సత్కరించారు. రవికుమార్‌కు పార్టీ మండల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరిగినా వారికి అండగా ఉండాలన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పార్టీ పెద్దలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తోందని, దీన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఆమదాలవలసలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, ఈ నియోజకవర్గాన్ని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని, అందుకు అందరూ ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుల నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కన్నబాబుకు, శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాంతో పాటు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస పట్టణం, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, బెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, కొంచాడ రమణమూర్తి, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి, పొందూరు జెడ్పీటీసీ సభ్యులు సురవరపు నాగేశ్వరరావు, లోలుగు కాంతారావు, పార్టీ ముఖ్య నాయకులు దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, దుంపల చిరంజీవిరావు, బి.వి.రమణమూర్తి, చింతాడ వెంకటరమణ, కూన రామకృష్ణ, చింతాడ ప్రసాద్‌రావు, బద్రి రామారావు, బూరి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చౌర్యంపై ఫిర్యాదు



ఇటుక బట్టీల వద్ద అక్రమంగా పైపులైన్‌ను కట్ చేసిన దృశ్యం

పోలాకి: మండలంలోని చీడివలస పంచాయతీ పరిధిలోని జిల్లేడువలస గ్రామానికి ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్ నుంచి నీటి చౌర్యం జరుగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రవికుమార్‌కు సర్పంచ్ ముద్దాడ రాము సోమవారం ఫిర్యాదు చేశారు. నేతింటి రామ్మూర్తి అనే వ్యక్తి ఇటుక బట్టీలకు కనెక్షన్ ఇచ్చి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గతంలో రామ్మూర్తిని హెచ్చరించి.. డమ్మీలు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మరోవైపు బెలమరపాలవలస పంచాయతీ పరిధిలోని జొన్నయ్యపేటకు రహదారి నిర్మాణం చేపట్టే క్రమంలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి అందించే తాగునీటిని కూడా కొంతమంది సొంతానికి వాడుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వాటిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు.

చెత్తవేసిన వారిపై చర్యలేవి సారూ!



ఈ చిత్రం పోలాకి తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని పెట్టిన హెచ్చరిక బోర్డు. ఈ బోర్డు వద్దే చెత్త వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్వచ్ఛాంధ్ర పేరుతో హడావిడి చేసిన నాయకులు, అధికారులు ఆ తరువాత పారిశుద్ధ్య పనులను ఎక్కడా పట్టించుకోవటం లేదనటానికి ఇదే నిదర్శనమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై మండల పంచాయతీ అధికారి బి.పద్మావతి దృష్టికి తీసుకెళ్లగా.. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. - పోలాకి

బిక్కు.. బిక్కుమంటూ..



పాతపట్నం కోర్టు కూడలి వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 1959లో నిర్మించిన ఈ భవనంలోనే నేటికీ సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా శాఖల సిబ్బంది సేవలందిస్తున్నారు. శ్లాబ్, కిటికీల పెచ్చులు ఊడిపడుతుండటంతో బిక్కు.. బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా ఇబ్బందులు తప్పడం లేదు. విలువైన రికార్డులకు రక్షణ లేదు. నూతన భవనాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. - పాతపట్నం

శిథిలావస్థ..



సరుబుజ్జిలి మండలంలోని చినకాగితాపల్లి పంచాయతీ పరిధిలోని వీరభద్రాపురంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో ఉన్న విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులను ఎదురుగా ఉన్న భవనంలోకి మార్చారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనం వద్దకు చిన్నారులు ఆడుకునేందుకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి శిథిల భవనాన్ని కూల్చివేయాలని కోరుతున్నారు. ఈ భవనాన్ని వెంటనే పరిశీలిస్తామని ఎంఈఓ బాలరాజు తెలిపారు. - సరుబుజ్జిలి

నిరుపయోగం..



కొత్తూరు మండలంలోని గొట్టిపల్లి గిరిజన గ్రామంలోని చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా ఉంది. రూ.లక్షలు వెచ్చించి మూడేళ్ల క్రితం నిర్మించారు. గ్రామంలోని చెత్తను ఈ కేంద్రానికి తరలించాలి. అక్కడ చెత్తను తడి, పొడిగా వేరుచేసి కుండీల్లో వేయాలి. చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువుగా తయారుచేయాలి. ఎరువులు గ్రామస్తులకే విక్రయించాలి. దీని ద్వారా వచ్చిన ఆదాయం పంచాయతీ నిధులకు జమ చేయాలి. అలా చేసిన దాఖలాలు ఇక్కడ లేవు. - కొత్తూరు

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



పుట్ట మన్నును తీసుకువస్తున్న మహిళలు, గ్రామస్తులు

పొందూరు: మండలంలోని రాపాకలో గల కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు పొలాల్లోని పుట్టమన్నును తీసుకువచ్చి పందిరిరాట వేశారు. సంప్రదాయ పద్ధతిలోనే ఉత్సవాలను ప్రారంభించారు. రుత్వీకులు కూనపులి రమణమూర్తి, ఆలయ పూజారి గోపి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



పాతపట్నం: ప్రహరాజపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నరసన్నపేట: స్థానిక జామియా మసీదులో సోమవారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షను విరమించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ బాబ్జీ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ మరింతగా విస్తరించాలని, వ్యక్తిత్వాలను మంచిగా నిర్మించుకోవాలన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ముస్లిం ప్రతినిధులు షేక్‌మదీన్, ఆరిఫ్, ఎం.డి.రఫీ, ఎం.డి.ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరాజపాలెంలో

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న కామ్రాన్ మసీదులో అఫీజ్ షాజహాన్ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో రంజాన్ నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు ముస్లింలతో కలిసి పార్థనలు చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. షేక్ చాంద్, షేక్ ఇబ్రహీం, షేక్ మొహిద్దీన్, షేక్ సలీమ్, సయ్యద్ మదాన్, సయ్యద్ జమాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నరసన్నపేట: జామియా మసీద్‌లో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: ఈ నెల 2వ తేదీన పట్టణంలోని మెట్టక్కివలస టౌన్–2 ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెట్టక్కివలస, అమ్మానగర్, కుప్పిలివారివీధి, ఊసవానిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: ఈ నెల 2వ తేదీన మండలంలోని చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో జలుమూరు ఫీడర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఏఈ వి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జలుమూరు, చల్లవానిపేట, టెక్కలిపాడు, రావిపాడు, రావాడపేట, హరికృష్ణమ్మపేట, సొడాం, దరివాడ, జోనంకి, తలతరియా, అల్లాడ, సైరిగాం, లింగాలవలస, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

సహస్రనామార్చన



సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక గీతామందిరంలో శ్రీరామ నవరాత్రుల సందర్భంగా సోమవారం సీతారాముల సహస్రనామాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు సూరిబాబు ఆధ్వర్యంలో 101 మంది మహిళలు పాల్గొని సహస్ర నామార్చన చేశారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ సీతారాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



గీతామందిరంలో సహస్రనామార్చనలు చేస్తున్న భక్తులు

రెల్లి కులస్తులకు అన్యాయం



మాట్లాడుతున్న రెల్లి గ్రూప్ కులాల ప్రతినిధులు

నరసన్నపేట: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీరని అన్యాయం జరిగిందని, ఈ వర్గీకరణను పునః సమీక్షించి న్యాయం చేయాలని రెల్లి గ్రూప్ కులాల ప్రతినిధులు డి.మోహన్‌రావు, బెవర రాము ప్రభుత్వాన్ని కోరారు. నరసన్నపేటలో ఎస్సీ వర్గీకరణపై రెల్లి గ్రూప్ కులాల సభ్యులతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు, రాము మాట్లాడుతూ రెల్లి కులాలకు రిజర్వేషన్ల ప్రక్రియలో ఏబీసీడీలుగా విభజించి.. 'ఏ' లో చేర్చి ఒక శాతమే కేటాయించారని, దీని వలన తమకు అన్యాయం జరుగుతుందన్నారు. హేతుబద్ధతలేని వర్గీకరణను వెంటనే ఆపాలని, కులగణన చేసి జిల్లా, జోన్ల వారీగా వర్గీకరణ చేపట్టాలన్నారు. వెనుకబాటుతనానికి ప్రాధాన్యత నివ్వాలని, 2004లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని, రెల్లి కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పొందూరు: మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ



పాతపట్నం: సూచనలిస్తున్న ఎస్ఐ లావణ్య

పొందూరు: ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చర్చిలు, దేవాలయాలు, మసీదుల నిర్వాహక కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అర్చకులు, పాస్టర్లు, మసీదు నిర్వాహకులు పాల్గొన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: మండలంలోని అన్ని ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ బి.లావణ్య సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. రాత్రి సమయంలో ఎవరో ఒకరు అందుబాటులో ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు.